# శేష వస్త్రం

"రుక్మిణీ నేనొకసారి అలా ఆలయానికి వెళ్తాను. మళ్ళీ ఉదయాన్నే వస్తాను. లేచి తలుపు వేసుకో" అని అన్నాడతను.

భర్త అంటున్న మాటలకు ఆయోమయంగా చూసిన రుక్మిణి "ఇప్పుడా... ఇంత అర్ధరాత్రి ఆలయానికి వెళ్ళటం ఏంటండీ" దిగులుగా, భయంగా, బాధగా అడిగిందామె.

"లేదు రుక్మిణీ నిద్రపట్టటంలేదు. మనసంతా వ్యాకులంగా ఉంది. ఈ కోపము చిరాకు, పరాకు పోవాలంటే అమ్మవారి దగ్గర కూర్చుని స్తోత్రాలు చదువుకుంటూనో, కీర్తనలు పాడుకుంటూనో కూర్చోవడం తప్ప మరో మార్గం లేదు.

నువ్వన్నా నన్నర్థంచేసుకో" జాలిగా అన్న భర్తవంకచూసి మౌనంగా మంచం దిగిందామె.

దేవుడి గూట్లోవున్న ఆలయం తాళం చేతులు చేత పుచ్చుకుని అడుగులో అడుగు వేసుకుంటూ బయటకు నడిచాడు ఆంజనేయశాస్త్రి.

అలా వెళ్తున్న భర్తనుచూసి, అసహాయంగా తలుపుమూసి చెంగునోటికి అడ్డుపెట్టుకుని పడకగదిలోకి పరుగుతీసింది రుక్మిణి. వెక్కివెక్కి ఏడ్చింది. మూడు రోజులుగా నిద్రాహారాలు లేవు భర్తకు. ఏదో పిచ్చిపట్టినవాడిలా తయారయ్యాడు. ఆయన మళ్ళా మామూలు మనిషి ఎప్పటికి అవుతాడో అంతుపట్టకుందామెకు. ఏడ్చిఏడ్చి అలసిపోయి ఎప్పటికో నిద్రలోకి జారుకున్నదామె.

ఆలయం తలుపులు తెరిచి, చీకటిలో వెతుక్కుంటూ అగ్గిపెట్టె అందుకుని దీపారాధన చేశాడు ఆంజనేయశాస్త్రి. లైటు వేసుకోకుండా, తలుపు మూసి ఆ మసక చీకట్లోనే లోలోపలే అమ్మవారి స్తోత్రాలు పఠిస్తూ కూర్చున్నాడు.

ఎప్పటికో కాస్తంత కునుకుపట్టింది.

* * * *

ఆంజనేయశాస్త్రికి ఆ ఆలయంలో అర్చకత్వం చేసే అవకాశం అయాచితంగా, ఆకస్మికంగా వచ్చింది. తండ్రిగారి అకాలమరణం కారణంగా అతనా బాధ్యతలు స్వీకరించక తప్పలేదు. తప్పులేదు. అందుకు అతగాడు అర్హుడే.

అర్చకత్వానికి కావలసిన అర్హతలన్నీ అతనికి ఉన్నయ్. ఎటొచ్చి వేదమంత్రాల్తోపాటు అతను చదివిన పోస్టుగ్రాడ్యుయేషను చదువూ, అతగాడి అందచందాలు, ఆస్తిపాస్తులూ చూసి పెళ్ళాడిన సహధర్మచారిణి గునుపూ మొదట్లో ఆంజనేయశాస్త్రిని సుముఖుడ్ని చేయలేదు.

అయితే చదివిన చదువుకు తగినటువంటి ఉద్యోగం లభిస్తుందన్న ఆశ చచ్చిపోయిన కారణంగానూ, అందుకు అతని వయోపరిమితి మీరి పోయిన కారణంగానూ ఇవన్నీ కాక అర్చకత్వం ద్వారా వచ్చే ఆదాయం ఆకర్షణీయంగా ఉన్న కారణంగానూ ఆంజనేయశాస్త్రి భార్యను అనునయించి, అర్చకత్వానికి అంగీకరించాడు.

అందుకు, అందరికంటె అధికంగా అతడి కన్నతల్లి ఆనందించింది. కొడుకూ, కోడలూ, పుట్టబోయే సంతానంతో తనకళ్ళముందే ఉంటారన్న సంతోషం సగమైతే తన భర్తనుండి వారసత్వంగావున్న అర్చకత్వం కొడుకు చేపట్టడం ఆమె చిరకాల వాంఛ. ఆ కోరిక తీరినందుకు సగం సంతోషం వెరసి ఆ సంతోషంతో, ఆ వయసులో ఆమెకు సగం బలాన్ని కాదు పూర్తిబలాన్నిచ్చింది.

సూటూ బూటూ వేసుకుని దర్జాగా స్కూటర్ మీద తనను ఎక్కించుకుని ఏ భాగ్యనగరంలోనో, చెన్నపురిలోనో చలాకీగా తిరుగుతాడని అనుకుని తాడు కట్టించుకుంటే తగుదునమ్మా అని తండ్రి గారి అర్చకత్వం స్వీకరించాడేం చెప్మా అని కొన్నాళ్లు కలవరపడినా, పోను పోను మనసు కుదుట పరచుకున్నది. వివేకవంతురాలయిన రుక్మిణి, ఆంజనేయశాస్త్రి భార్య.

అర్ధాంగి అలా తనను పూర్తిగా అర్థం చేసుకున్నందుకు ఉప్పొంగి పోయాడు శాస్త్రికూడా. ఆ ఒక్కకారణంగా భార్య ఏం చెప్పినా వినాల్సిందే అని నియమం పెట్టుకున్నాడు అప్పట్నుంచీ ఆంజనేయశాస్త్రి.

అదినుంచి ఆంజనేయశాస్త్రి గొప్ప భక్తుడేం కాదు. అలాగని భగవత్ చింతన లేనివాడూ కాదు. దానవత్వం - మానవత్వం - మాధవత్వం...

అనే మూడింటికీ అతను చెప్పుకునే నిర్వచనాలివి.. పక్కవాడు పాడైపోయినా తను బాగుంటే చాలనుకోవటం దానవత్వమనీ, తనతోపాటు తోటివాడు కూడా సుఖంగా ఉండాలని కోరుకోవటం మానవత్వమనీ, తను ఎలావున్నా సుఖంగానే ఉన్నట్టు భావిస్తూ పక్కవాడు మాత్రం సుఖంగా, తృప్తిగా ఉండాలని కోరుకోవటం మాధవత్వం అనీ ఆంజనేయశాస్త్రి అభిప్రాయాలు.

అతని విషయానికి వస్తే తను సుఖంగావుంటూ పక్కవాడూ సుఖంగా ఉండాలని కోరుకునే వర్గానికే చెందుతాడు. అందుకే అతడు మహాపురుషుడు కాకపోయినా, పుణ్యపురుషుడు కాకపోయినా మామూలు మానవుడు.

మనసున్న మనిషి, మనిషిగా బ్రతుకుతున్న బ్రతకాలనుకుంటున్న మనిషి. అతన్లోని ఆ మానవత్వాన్ని సమాజం బ్రతకనిస్తే చాలు.

ఉన్నంతలో ఉచితానుచితాలు గ్రహించడం, వస్తున్నదాన్తో వస్తు లుండాల్సిన అవసరంలేదుకదా అని సంతృప్తిపడటం మొదట్నుంచీ అతనికి అలవాటే. ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే ఉత్సవాలప్పుడు మాత్రం తండ్రికి సహాయంగా ఆ మూడు రోజులు ఉండేవాడు. ఆయనెప్పుడైనా ఊరు వెళ్ళినా అనారోగ్యంగాఉన్నా కోవెలకు వెళ్లి నివేదనాదులు నిర్వహించేవాడు.

అలాంటి పరిస్థితుల్లో తనే పూర్తిగా ఆలయ పూజాదులు నిర్వర్తించవలసిరావటం, ఆంజనేయశాస్త్రికి మొదట్లో కాస్తంత బెరుగ్గా అనిపించినా కాలం గడిచినకొద్దీ అలవాటుపడ్డాడు.

ఉత్సవాలు దగ్గరపడుతున్నకొద్దీ ఉత్సాహంగా అందుకు తగిన ఏర్పాట్లు చేయటంలో మునిగి తేలసాగేడు ఆంజనేయశాస్త్రి.

తండ్రిలేని లోటు ఏమాత్రం కనిపించనీయకూడదని రెట్టించిన ఉత్సాహంతో ఆ కార్యక్రమాల్లో పూర్తిగా నిమగ్నమయ్యాడు.

కమిటీ మెంబర్లందర్నీ తనకు సహకరించి, సూచనలివ్వవలసిందిగా అభ్యర్థించాడు.

మూడురోజులూ నిద్రాహారాలు మానుకుని ఆలయ ఉత్సవాన్ని తండ్రికంటె బాగా ఘనంగా పూర్తిచేయగలిగాడనిపించుకున్నాడు.

ఊరేగింపు ముగిశాక తల్లిని కౌగలించుకుని పెద్దగా బావురుమన్నాడు. తండ్రి జ్ఞాపకాలు అతన్ని దుఃఖానికి గురిచేసినై, కొడుకుని ఓదార్చి తనూ కంటతడి పెట్టుకుందతని తల్లి.

మూడురోజుల ఉత్సవాల్లోనూ వందకుపైగా చీరెలు, రెండవందల వరకూ జాకెట్టు గుడ్డలు అమ్మవారికని ఇచ్చారు భక్తులు.

ప్రతిఏటా జరిగేదే అది. అయితే వాటిల్లో భార్యకు నచ్చినవి ఓ అరడజను చీరెలు ఆమెకు ఇచ్చేవాడు. కోడలు వచ్చాక ఆమెకు ఓ అరడజను చీరెలు ఇచ్చి మిగిలినవి కమిటీ మెంబర్లకు అప్పచెప్పేవాడు తండ్రి. వాళ్ళు వాటిని ఏం చేసుకునేవారో పట్టించుకొనేవాడు కాదాయన.

కానీ ఆంజనేయశాస్త్రి అలా చేయలేదు. తల్లికిగానీ భార్యకుగానీ జాకెట్టు గుడ్డకూడా ఇవ్వలేదు. అలాగని ఆ మొత్తం బట్టలు తీసికెళ్లి ఆలయ కమిటీవారికీ అప్పగించలేదు.

ఓ పదిరోజులయ్యాక కమిటీ సభ్యులంతా శాస్త్రి ఇంటికి వచ్చారు. బట్టల విషయం ప్రస్తావించారు. "ప్రతిసారీ మీరు ఈ చీరెలు వగైరా తీసుకువెళ్తున్నారు, మీకు తోచినదేవో ఆలయ లెక్కల్లో జమ చూపిస్తున్నారు. కాని ఇకనుంచీ అలా జరగటానికి వీల్లేదు. ఈ బట్టలన్నింటినీ బహిరంగవేలం వేయాల్సిందే. ఆ వచ్చిన ఆదాయం ఆలయ మరమ్మతులకు, అభివృద్ధికీ వినియోగించవలసిందే" అని ఖచ్చితంగా చెప్పేడు ఆంజనేయశాస్త్రి.

కమిటీ మెంబర్లంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తలకాయలు ఊపుకున్నారు. కళ్ళు తిప్పుకున్నారు. మూతులు ముడుచుకున్నారు.

"ఈ ఆలయానికి నువ్వు అర్చకుడివనే విషయం గుర్తుందా" వెటకారంగా అడిగాడు ఒకాయన.

"నీ హద్దులో నువ్వు ఉండటం మంచిది" హెచ్చరింపుగా పలికిందో కంఠం.

"ఏదో పోనీలెమ్మని జాలితలచి మీ నాన్నగారి అర్చకత్వాన్ని నీకు అప్పచెబితే... మాకే నీతులు చెప్తున్నావేంటీ" ప్రశ్నించింది మరోగళం.

"బాబూ ఒక్కసారిలా రారా" లోపల్నుంచి పిలిచింది ఆంజనేయశాస్త్రి తల్లి.

అందరివంక ఓసారి చూసి లోపలికి వెళ్ళాడు.

"నీ కెందుకయ్యా వాళ్ళతో గొడవలు. మీ నాన్నగారు ఎలా చేసేవారో నీవూ అలాగే చెయ్. మన పనేంటో మనం చేయడం వరకే చూసుకోవాలి" అనునయంగా అన్నదామె.

"అవునండీ... అత్తయ్య చెప్పినట్లు చేయండి. మనకి ఎందుకువచ్చిన గొడవ. లేనిపోనివన్నీ పెట్టుకోకండి" మందలింపుతో గూడిన అభ్యర్థన వెలువడింది అర్ధాంగి నోటినుండి.

"మీరేం మాట్లాడకండి, నేచూసుకుంటాగా, ఏం పరవాలేదు" అని బయటకు వచ్చాడు శాస్త్రి.

"ఏవీ...ఆ బట్టలు తీసుకురండి. మేం వెళ్లాలి" అంటూ తొందరచేశాడు ఒకాయన.

"క్షమించండి. వాటిని మీకు అలా ఇవ్వలేను ఇవ్వను. ఆ బట్టలన్నింటిని నేను అనుకున్న ప్రకారం వేలం వేయవలసిందే. ఆ వచ్చిన డబ్బుతో గుడిని బాగు చేయించవలసిందే.

మీకు అంతగా ఇష్టంలేకపోతే ఊళ్ళో జనాన్ని ఒకచోట చేర్చి వాళ్ల అభిప్రాయం ఏమిటో కనుక్కుందాం. వాళ్ళు ఎక్కువమంది ఏం చేయమంటే అదేచేద్దాం" అని ముగించాడు శాస్త్రి.

"సరే.. మేమూ చూస్తాం నీ సంగతి" గొణిగినట్లుగా అనుకుంటూ ఒకరి వెనకాల ఒకరుగా వచ్చినదారిన వెళ్ళిపోయారందరూ.

* * * *

ఆంజనేయశాస్త్రి కోరిక మేరకు ఆలయ ప్రాంగణంలోనే అమ్మవారి చీరెల బహిరంగ వేలానికి ఏర్పాట్లు పూర్తయినై. ఊళ్ళో అందరికీ తెలిసే విధంగా రిక్షాలో మైకుపెట్టి చెప్పించారు.

ఊరిలో చాలామంది ఆడవారు చెప్పిన సమయానికి ఆలయానికి చేరుకున్నారు. సన్నిహితులైన ముగ్గురు యువకులచేత ఇంటినుండి చీరెలు జాకెట్టు గుడ్డలు తెప్పించాడు ఆంజనేయశాస్త్రి. చీరె వేలంలో పొందినవారికి జాకెట్టు గుడ్డ ఉచితం అని కూడా ప్రకటించాడు.

కమిటీ మెంబర్లు నలుగురుకూడా అక్కడ ఆసీనులయ్యారు. పదినిమిషాల్లో చీరెలన్నింటిని మూడు వర్గాలుగా విభజించాడు శాస్త్రి.

పక్క ఊరునుంచి బట్టల షాపులో పనిచేసే ఒకతన్ని అందుకు ఉపయోగించుకున్నాడు.

ఖరీదయిన చీరెను చేతిలోకి తీసుకుని "అమ్మవారిపాట మూడువందలు మూడువందలు" అరచినట్లుగా అన్నాడు ఆంజనేయశాస్త్రి.

ఆడవారంతా ముఖముఖాలు చూసుకున్నారు. మూతులు మూడేసి వంకర్లు తిప్పి కూర్చున్నారు. ఎవర్లోనూ ఉలుకూ పలుకూ లేదు.

కాసేపు గడచిపోయిన తర్వాత రెండోరకం లోంచి ఒకచీరె తీసుకుని.

"అమ్మవారి పాట నూటయాభై రూపాయలు" అన్నాడు మళ్ళీ అదే పరిస్థితి నెలకొంది.

కమిటీ మెంబర్లు ఒకర్నొకరు చూసుకుని మురిసిపోయారు. నవ్వు బయటకు రాకుండా బలవంతాన ఆపుకుని కూర్చున్నారు.

మూడోరకంలోంచి ఓ చీరె తీసుకుని "అమ్మవారిపాట అరవై రూపాయలు...అర..." అతని అరుపు, అర్ధాంతరంగా ఆపుతూ –

"నాపాట ఇరవై రూపాయలు" అన్నది ఒకావిడ గుంపులోంచి పైకిలేచి విసురుగా.

అర్థంకానట్టు చూశాడు ఆంజనేయశాస్త్రి.

"పదిహేను రూపాయలు" ఇంకొకావిడ నడుం చుట్టూ కొంగుబిగిస్తూ అన్నది.

"పది రూపాయలు" ఇద్దరు ఆడవారు ఒకేసారి పలికారు ఖంగుమనే కంఠంతో.

నవ్వాపుకోలేకపోయారు కమిటీ మెంబర్లు.

"ఎందయ్యా అమ్మోరి చీర్లు అయిదుకో పదికో ఇస్తావని వస్తే ఒందలొందలని లొడలొడ కొట్టుకుంటున్నావ్" దబాయించిందో మహా ఇల్లాలు.

'అవన్నీ మేం ఇచ్చినవే కదండీ.. మళ్ళీ అంతంత పెట్టికొనాలంటే కష్టం కదా" అని తన మాటల్లో లౌక్యం చూపిందో శ్రీమతి.

"సరే మీ ఇష్టం. ఇప్పటిలాగే ఈ చీరెలన్నింటినీ జాకెట్ గుడ్డల్తోసహా ఈగుడి కమటీకి చెందిన మెంబర్లకే అప్పగిస్తున్నాను. మీ అందరి సమక్షంలో వీటిని వాళ్ళకి ఇచ్చేస్తున్నాను.

ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఇది నా ఒక్కడి ఓటమీ కాదు, మనందరి అపజయం" అని ఆ బట్టలన్నింటిని అక్కడే వదలి పెట్టేసి నీటి సుడులు తిరుగుతున్న కళ్ళు ఎవరికంటా పడకుండా ఇంటికి చేరుకున్నాడు శాస్త్రి.

* * * *

అదుగో అప్పట్నుంచి అతని మనసంతా కకావికలం అయింది. తనకేదో అవమానం జరిగిందని అతను బాధపడటంలేదు. అమ్మవారి వస్త్రాలను అపురూపంగా భావించి, ఆలయం అభివృద్ధికి వినియోగించాలను కున్నాం కాబట్టి పెద్దమొత్తంలో పాడి ఎక్కువ ఆదాయం సమకూరుస్తారనుకున్న మనుషులు తన ఆంతర్యాన్ని గ్రహించలేకపోయారని ఆవేదన పడసాగాడు.

ఇంట్లో భార్యా తల్లి ఎంతగా అనునయించినా అతని ఆవేదన చల్లారలేదు. సన్నిహితులు ఎంతగా సర్దిచెప్పినా తన మనసుకు తగిలిన గాయం తగ్గుముఖం పట్టలేదు. అన్నం తినబుద్ధి గాక నిద్రపట్టక మనిషి బాగా డీలాపడిపోయాడు.

అందుకే అతని మనోవేధన కొంతవరకైనా ఉపశమింపచేసుకోవాలనే ప్రయత్నంలోనే అర్ధరాత్రి అలా ఆలయానికి వెళ్లి తను నిత్యం పూజించే ఆ జగజ్జనని చెంతచేరి ఒకింత సేద తీర్చుకోవాలనుకున్నాడు. తన ఆవేదనను ఆమెకే నివేదించుకోవాలనుకున్నాడు ఆంజనేయశాస్త్రి.

* * * *

"శాస్త్రీ... ఊరుకోవయ్యా... నీ ఆవేదన అర్థం అయ్యింది. నీ ఆశయం గొప్పదే... కానీ లోకం నువ్వనుకున్నంత ఉన్నతంగా లేదయ్యా...

పిచ్చి మనుషులు బట్టలు పెట్టటంలో బంధుత్వాలు నిలుపుకోవాలని కొందరు, పెంచుకోవాలని మరికొందరు, బయట పడేసుకోవాలని ఇంకొందరు... ఇలా.. అలాగే నాకూ పెట్టారు. తప్పనను కానీ రోజులెలా ఉన్నయ్...

ఏ దేశపు రాణో వాడి వదిలేసిన లిప్‌స్టిక్ సీసా (ఖాళీదే సుమా) వేలంవేస్తే వెర్రిగా వేల డాలర్లు పెట్టి కొనుక్కుంటారు. ఏ యువరాణో వాడిన బ్రాసరి వేలం వేస్తే కోట్లతో కొంటారు. ఏ సినిమా నాయకామణో ఓ సినిమాలో గంట కట్టుకుని విడిచిన పరికిణి వేలం వేయమనూ... పదెకరాలు పణంగా పెట్టయినా ఖేలంలో పాడేస్తారు...ఏ ప్రపంచ సుందరీమణి తలలో వెలసిన తొలి ఫలిత కేశాన్ని వేలం వేయమని చూడు ఎన్ని లక్షలకు నిక్షేపంగా కొంటారు....

అమ్మవారి శేష వస్త్రాల విశేషం ఎవరికి తెలుసయ్యా! ఆవిడెవరో చెప్పిందిగా అయిదుకో, పదికో అనుకున్నాం అని ! ఊరుకో... మధనపడకు...

నువ్వు మనిషిగా జీవించాలనుకుంటున్నావు కాబట్టి ఇలా ఆలో చిస్తున్నావ్. అలాగే ఆలోచించు. అలాగే ముందుకు వెళ్ళు. ఎప్పటికయినా గెలుపు నీదే.. ఏడ్వకు... నిన్ను చూసి లోకం ఏడ్వాలి... ఊరుకో" అని ఓదారుస్తున్న ఆ స్త్రీమూర్తి పాదాల పైబడిన ఆంజనేయశాస్త్రి కల చెదిరింది.

కళ్లు చటుక్కున తెరుచుకున్నయ్. తాను ఆలయంలో ఉన్నట్లు గ్రహించాడు. కలనంతా మరోసారి మననం చేసుకున్నాడు.

రెట్టించిన ఉత్సాహంతో గొంతు విప్పి, మనసు ఉంచి, శిరసువంచి చేస్తున్నానూ వందనాలు, అభివందనాలు అమృత రూపిణికి, ఆనందకారిణి... అంటూ పాటవిన్పించి ఇంటికి వెళ్ళాడు.

భర్త ముఖంలో కన్పిస్తున్న కొత్తవెలుగు రుక్మిణి కళ్ళలో వేల కాంతుల్ని వెదజల్లింది. అమ్మవారి అభయహస్తం అలా విరాజిల్లుతూనే ఉంది.

◆ స్వాతి - సెప్టెంబరు, 2000 ◆